ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు వేయాలి

విశాలాంధ్ర - గొలుగొండ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ తమ విలువైన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్సై బి.కృష్ణారావు తెలిపారు. ప్రజల వద్దకే పాలన లాగా ప్రజల వద్దకే పోలీస్ అనే విధంగా గురువారం రావణాపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల వద్దకు ఎస్సై వెళ్లి వివిధ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా ఉండాలని, అలాగే ప్రజలందరూ నాటు సారా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో సైబర్ నేరాలు, ఫోన్ నెంబర్ ట్రాక్ చేసి మెసేజ్ చెప్పమని లేదా క్లిక్ చేయమని చెబుతూ ఉంటారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీజేపీకి బిగ్ షాక్

పార్టీని వీడిన సీనియర్ లీడర్ కొలపర్తి, మరికొంతమంది

సీఎం రమేష్ ఒంటెద్దు పోకడలే కారణమా..?

టీడీపీ, బీజేపీ నుంచి వైసీపీలో చేరిన నేతలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అంతంతమాత్రంగానే ఉన్న బీజేపీకి జిల్లాలో బిగ్ షాక్ తగిలింది. పట్టుమని పుంజుడు మంది కూడా లేని బీజేపీని కొన్ని సంవత్సరాలుగా మోస్తున్న సీనియర్ నాయకులు ఎన్నికల వేళ పార్టీకి గుడ్ బై చెప్పడంపై సర్వత్రా ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. కలలో కూడా బీజేపీ నాయకులు ఆలోచించని విధంగా పొత్తుల భాగంలో అనకాపల్లి ఎంపీ సీటు బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. బీజేపీకి అనకాపల్లి ఎంపీ సీటు కేటాయించారని సంబరాలు జరుపుకున్న ఆ పార్టీ కార్యకర్తల ఆశలపై నీళ్లు జల్లుతూ, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఒంటెద్దు పోకడలతో పార్టీని నమ్ముకున్న వారినే విస్మరిస్తూ, నిర్లక్ష్యానికి గురిచేస్తున్న వ్యవహారంపై బీజేపీ నాయకులు ఇప్పటికే గుర్రుగా ఉన్నారు. సీఎం రమేష్ నుంచి ఏదో ఆశించి కొందరు సర్దుకుపోతుంటే.. పార్టీ ఉనికిని కాపాడడం కోసం ఇన్నేళ్లుగా కష్టపడిన తమను విస్మరిస్తున్నారని అవమానంతో మరికొందరు బయటకు వస్తున్నారు. అలా ప్రస్తుతం బయటికి వచ్చి వైసీపీలో చేరిన సీనియర్ బీజేపీ లీడర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొలపర్తి శ్రీనుతోపాటు స్టేట్ ఓబీసీ సెక్రటరీ అలమండ శ్రీను, బీసీ స్టేట్ సెక్రటరీ నీలగిరి వరహాలు, ఏడిద మహేష్, వి.జి. నూకరాజులు ముందు వరుసలో ఉంటారు. సీఎం రమేష్ తమకు ప్రాధాన్యత ఇవ్వకపోయినా సర్దుకుపోయి పార్టీ విజయానికి కృషి చేద్దామనుకున్నా అవమానాలు ఎదురవుతున్నాయని భావన కొలపర్తి శ్రీనులో కనిపించడం విశేషం.

కూటమిలో చేరికలు బహు విచిత్రం...

ఎప్పుడు, ఎవరు చూడని, వినని చిత్రవిచిత్రాలు కూటమిలో కనువిందు చేస్తున్నాయి. కూటమిలో ఉన్న ఒక పార్టీ నుంచి అదే కూటమిలో ఉన్న మరో పార్టీలోకి చేరికలు చూస్తుంటే బహు విచిత్రంగా ఉన్నాయని ప్రజలను నవ్వుకుం టున్నారు. జనసేన నుంచి బీజేపీకి, టీడీపీ నుంచి జనసేనకు, జనసేన నుంచి టీడీపీకి ఆయా పార్టీల నుంచి నిత్యం చేరుతున్న చేరికల పట్ల జిల్లాలో జోకులు పేలుతున్నాయి. కూటమిలో జరుగుతున్న ఈ చేరికల కామెడీ ఈ నెల రోజులు ఎంత హాస్యం పండిస్తుందో ఎదురు చూద్దాం.

సీఎం రమేష్ సమక్షంలో బిజెపిలోకి చేరిన జనసేన నాయకులు

టీడీపీ, బీజేపీ నుంచి వైసీపీలోకి చేరికలు

తుమ్మపాల గ్రామంలో గురువారం జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీ బీశెట్టి సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సమక్షంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, రైతు సంఘం ప్రెసిడెంట్ పీలా బుజ్జి ఆధ్వర్యంలో బిజెపి నాయకులతో పాటు టీడీపీ నాయకులు కొణతాల శ్రీను, సదరం నూకరాజు, పీలా శ్రీను, రామిరెడ్డి, చదరం పోలిశెట్టిలతోపాటు సుమారు 50 మంది వైసీపీలోకి చేరారు. వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ జిల్లా నాయకులు పూలమాల నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ సాంఘిక అసమానత, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన మహా యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే నేటి తరానికి గొప్ప ఆదర్శమన్నారు. సమాజం అభివృద్ధి, స్త్రీలకు విద్య చాలా కీలకంగా భావించి, తన భార్యకి విద్య నేర్పి పాఠశాల ఏర్పాటు చేసి బలహీన వర్గాలకు విద్య నేర్పిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు అందరూ ఐక్యతతో కృషి చేయాలని దొరబాబు పిలుపునిచ్చారు. విద్యార్థులకు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను వివరిస్తే సమాజం చైతన్యం వైపు అడుగులు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కోరుబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ, పోతురాజు, వీరు యాదవ్, సత్తిబాబు, సూరిబాబు, రమణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై యస్.రాయవరం ఎస్సై ఏ.విభూషణరావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో రోడ్డు పై వచ్చిన వాహనాలు తనిఖీ చేసి వివరాలు నమోదు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పంపడం జరుగుతుందన్నారు.

టీడీపీ సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చీడికాడ: మండల కేంద్రంలోని శుక్రవారం నిర్వహించు నియోజకవర్గ స్థాయి సమావేశం జయప్రదం చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. టీడీపీ నాయకులు కార్యకర్తలతో చీడికాడలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి సురేస్ నాయుడు విచ్చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామం నుండి భారీ స్థాయిలో జన సమీకరణ చేసి ఈ కార్యక్రమన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతల చిన్నంనాయుడు, పోతల రమణమ్మ, నాయకులు గండి ముసలినాయుడు, రెడ్డి సన్యాసినాయుడు, మేడపురెడ్డి శ్రీనివాసరావు, పుట్టా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి వ్యూహాత్మక ప్రచారం

విశాలంధ్ర - అచ్యుతాపురం: కన్నబాబురాజు దాచుకోవడం, దోచుకోవడం తప్ప నియోజకవర్గ ప్రజలకు ఏమి చేశారని జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సుందర విజయకుమార్ ఆరోపించారు. ఎన్డీఏ కూటమి ప్రచారంలో ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సుందర విజయకుమార్, టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావు, అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్ కలిసి కాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాలలో గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి గాజు గ్లాసు, కమలం పువ్వు గుర్తులను అందిస్తూ వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టిన తర్వాత చేయబోయేటటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ గాజు గ్లాసు, కమలం పువ్వు గుర్తులపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాల నుంచి ఎటువంటి పదవులు చేపట్టకుండా నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్నానన్నారు. కన్నబాబు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి ఏం చేశాడని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాసు, కమలం పువ్వు గుర్తులపై ఓట్లు వేసి గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, బిజెపి, టీడీపీ మండల నాయకులు, తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర - గొలుగొండ: చాంద్రయానాన్ని అనుసరించి ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం రంజాన్ అని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారని మసీదు గురువు ఎండి కరీముల్లా అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామంలో గల మసీదులో రంజాన్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు గురువు కరీముల్లా మాట్లాడుతూ దివ్య ఖురాన్ ముస్లిముల పవిత్ర గ్రంథం ఈ మాసంలో ఆవిర్భవించిందని ముస్లింలు ప్రవక్తలు చెబుతుంటారని ఆయన అన్నారు. క్రమశిక్షణ దాతృత్వం ధార్మిక చింతనల కలయిక రంజాన్ మాసం అని ఆయన అన్నారు. గ్రామంలో ఉన్న ముస్లింలందరూ మసీదులో ఉదయం నుండి భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు.

యస్.రాయవరం: మండలంలో రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని ఎస్.రాయవరం, చెల్లాపురం, కొరుప్రోలు, సీతారామపురం గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చెల్లాపురం గ్రామంలో జరిగిన వేడుకల్లో పిఆర్ టియు ఉపాధ్యాయుల సంఘం నాయకులు పాల్గొని మత పెద్దలను సన్మానించారు.

పూలే స్ఫూర్తితో అసమానతలు రూపుమాపుదాం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మహాత్మ జ్యోతిరావు పూలే ఆదర్శాలను ఆచరిస్తూ సమాజంలో మిగిలి ఉన్న అసమానతలు రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే 198 వ జయంతోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితమే సమాజం ప్రగతి పదంలో పయనించాలంటే బాలికలకు విద్య అవసరమని గుర్తించి పూలే మహిళలకు పాఠశాల ప్రారంభించారని చెప్పారు. అట్టడుగు వర్గాల వారిలో చైతన్యం తీసుకువచ్చి సమాన హక్కుల కోసం పోరాడారన్నారు. వారి అడుగుజాడల్లో మనమంతా నడవా లన్నారు. వర్ణ వివక్ష లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేశార న్నారు. ఆయన కృషి వలననే ఈనాడు బాలికలు చదువుకో గలుగుతున్నారన్నారు. స్త్రీలకు పురుషులతో సమాన హక్కులు కల్పించడం, మహిళా సాధికారతకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే.రాజేశ్వరి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: బడుగు ,బలహీన వర్గాలచే మహాత్ముడిగా జన నీరాజనాలు అందుకున్న సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలేనని దళితరత్న,

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటరావు అన్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి మహెూత్సవం ఘనంగా జరిగింది. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించి ముందు తన భార్య సావిత్రిబాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. అంతేకాక అన్ని కులాలు వారు చదువుకునేలా పాఠశాలలను స్థాపించి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. బిసి, ఎస్సి, ఎస్టి మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నెక్కల్ల నాగమణి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే స్త్రీ పురుష లింగ వివక్ష, కుల బానిసత్వాలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ సామాజిక ప్రజాస్వామ్యం సాధించడం భారతదేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రకటించారన్నారు. సమ సమాజ స్థాపనకై అనునిత్యం శ్రమించిన జ్యోతిరావు పూలే సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పరవాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: సామాజిక విప్లవకారుడు జ్యోతీరావు పూలే భావితరాల స్ఫూర్తి ప్రదాత అని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. జ్యోతీరావు పూలే జయంతి సంధర్భంగా గురువారం గొర్లివానిపాలెం బీసీ కాలనీలో ఆయన

చిత్రపటానికి గనిశెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూళన, మహిళోద్ధరణకు జ్యోతీరావు పూలే ఎనలేని కృషి చేసారన్నారు. భారత దేశంలో అక్షరజ్ఞానం అందరికీ కావాలని ఆకాంక్షించిన తొలి సామాజిక విప్లవ కారుడు ఆయనే అన్నారు. భార్య సావిత్రిబాయికి చదువు చెప్పించి, ఆమెను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసిన ఘనత జ్యోతీరావు పూలేకే దక్కిందన్నారు. సీఐటీయు నాయకులు ఎ.వరలక్ష్మి, సీహెచ్ వరాలమ్మ, ఎ.అన్నపూర్ణ, పుష్ప, అనిత, లక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం: చోడవరం పట్టణం అంబేద్కర్ భవనంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ కార్య నిర్వాహక సభ్యులు కండీల్లి వెంకట్రావు మాస్టారు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతీ రావు పూలే సామాజిక సంఘ సంస్కర్త సమాజంలో ఎన్నో రకాలు మార్పులు కోసం కృషి చేశారన్నారు. ముఖ్యంగా స్త్రీ విద్యలు ప్రాచరించడం సమాజంలో అసమానతలు అరికట్టడానికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన సాహితి సభ్యులు కె.గౌరీ శంకర్ మాస్టారు, ఎస్.నూకచారి, ఎర్రం శెట్టివరప్రసాద్, ముఖ్య నాయకులు ఆర్.ఎస్.బ్రహ్మ లింగం, రాజు కొండ, చిన్నం నాగరాజు, పలువురు యువకులు పాల్గొన్నారు.

20న సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర అనకాపల్లి జిల్లాలో ఈనెల 20వ తేదీన పాయకరావుపేట నుండి ప్రారంభం కానున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేఖర్లతో బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ 20వ తేదీన ఉదయం పాయకరావుపేటలో మెయిన్‌రోడ్డు మీదుగా రోడ్ షో నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం నక్కపల్లి, అడ్డురోడ్డు, యలమంచిలి, అనకాపల్లి, చోడవరం మీదుగా బస్సు యాత్ర సాగుతుందని తెలిపారు. చోడవరంలో బహిరంగ సభ జరుగుతుందని, అనంతరం సబ్బవరంలో రాత్రి బస చేస్తారని తెలిపారు. బస్సుయాత్రలో భాగంగా ఆయా గ్రామాల కూడళ్లలో ప్రజలను కలుస్తారని తెలిపారు. బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా బస్సు యాత్రలో ముఖ్యమంత్రి జగన్‌ను కలిసేందుకు ప్రజలు తరలివస్తున్నారని తెలిపారు. బస్సు యాత్ర సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార కమిటి విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, జగతా శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి సత్య మహేష్, కాదా రామకృష్ణ, దేవవరపు వెంకటేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి దళిత కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలం చౌడువాడ గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు వైసీపీని వీడి మూకుమ్మడిగా టీడీపీ పార్టీలో చేరారు. టీడీపీ -జనసేన - బీజేపీల మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు సమక్షంలో గురువారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామంలో ఉన్న ఎస్.సి.కాలనీ నుంచి 25 కుటుంబాల వారు వైసీపీ పార్టీపై విసుగుచెంది, దళితులకు టీడీపీ ద్వారా మాత్రమే భవిష్యత్ ఉంటుందని నమ్మి మూకుమ్మడిగా గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు చల్లపల్లి శ్రీను ఆధ్వర్యంలో చేరారు. వారిని పైలా ప్రసాదరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడం నాయుడు, నాయకులు సిచ్.శ్రీను, జనసేన నాయకులు ఉగ్గిన త్రినాథ్, ఎస్.రమణ, ఎం.నాగరాజు, ఎం.శివ, కె.మణికంఠ, జిల్లా దళిత నాయకులు దొమ్మేటి బోస్, రాయి రామారావు, బత్తుల సింహాచలం, అనకాపల్లి అనిత, పారుపల్లి సోమేశ్వరరావు, మల్లారపు నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన ఉపాధి పనులు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండల కేంద్రంలో ఉన్న కౌశెట్టివాని చెరువులో ఎట్టకేలకు ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ చెరువులో 2009 నుంచి ఉపాధి పనులు చేయకపోవడంతో సాగునీరు అందడం లేదని గతంలో రైతులు కలెక్టర్‌కు స్పందనలో వినతి పత్రం అందించారు. చెరువు పూడిక తొలగించాలని కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చెరువులో పనులు చేపట్టేందుకు ఉపాధి పథకం నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో గురువారం నుంచి చెరువులో పూడిక తొలగింపు పనులు ప్రారంభించారు.

సైనికులంతా జనసేన వెంటే

నియోజకవర్గ సమన్వయకర్త గెద్దం బుజ్జి

విశాలాంధ్ర - నక్కపల్లి: అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసే అసత్య ప్రచారాలను ఎవ్వరూ నమ్మవద్దని, సైనికులందరూ జనసేన పార్టీ వెంటే ఉన్నారని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయ కర్త గెద్దం బుజ్జి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని వేంపాడు, చినదొడ్డిగల్లు కొత్తూరులో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని జనసేన, తెలుగుదేశం, బీజేపీకి చెందిన పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెద్దం బుజ్జి మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల మైండ్ గేమ్‌లో భాగంగా అధికార పార్టీకి చెందిన వారికే మళ్లీ వైసీపీ కండువాలు కప్పడంతో పాటు మరికొంతమంది జనసైనికులకు బలవంతంగా వైసీపీ కండువాలు కప్పి పార్టీ శ్రేణులంతా పార్టీ మారినట్లు అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి అసత్య ప్రచారాలను జనసైనికు లెవరూ విశ్వసించవద్దని బుజ్జి పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. బలవంతంగా వైసీపీ కండువాలు కప్పిన జనసైనికులంతా గ్రామంలో ఇంటింటా ప్రచారంలో పాల్గొని గెద్దం బుజ్జి నేతృత్వంలోని తామంతా జనసేన పార్టీలోనే ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాకలపాటి రవిరాజు, ఉపాధ్యక్షులు పోల్నాటి నానాజీ, మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగా సుధాకరరావు, మండల బీజేపీ అధ్యక్షులు కోసూరి శ్రీను, టీడీపీ నాయకులు వెలగా శ్రీనివాసరావు, స్థానిక జనసేన నాయకులు తూము రాజబాబు, వాసుదేవ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, ఎంపి అభ్యర్థి సీఎం రమేష్‌లను గెలిపించుకునేందుకు అందరూ సైనికుల్లా పనిచేయాలని టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బొంది కాశీవిశ్వనాద్, చింతకాయల రాంబాబు, గింజాల లక్ష్మణరావు, కంకిపాటి వెంకటేశ్వరరావు, గోసల కృష్ణ, చింతలపు ప్రదీప్, పల్లా విలియంకేరి, గారా కృష్ణప్రసాద్, కాండ్రేకుల ధనలక్ష్మి, మైలపల్లి అశోక్ చక్రవర్తి, వేములపూడి అప్పారావు, దువ్వ శ్రీనివాస్, వంకా శివ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు షాక్..

- మద్యం అమ్మకాలపై ఆంక్షలు

విశాలాంధ్ర - చోడవరం: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఎన్నికల సమయంలో మద్యం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వ రిటైల్ దుకాణాల్లో మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించింది ఎలక్షన్ కమిషన్. ఎం.సీ.సీ నిబంధనల ప్రకారం గత సంవత్సరం 2023 ఏప్రిల్ నెలలో ఏ షాపు ఎంత వరకు అమ్మకాలు జరిగాయో అంతే మేరకే అమ్మకాలు జరపాలని ఈసీ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఇదే నెలలో నమోదైన మద్యం అమ్మకాల పరిమాణాన్ని బట్టి రిటైల్ దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యం పరిమాణాన్ని నిర్ణయిస్తున్నారు అధికారులు. అదేవిధంగా ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి సరఫరా అయ్యే మద్యం సప్లయ్ పై ఎక్సైజ్ అధికారులు ఫోకస్ పెట్టారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు మద్యాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీనికితోడు వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో మద్యం, బీరుకు డిమాండ్ భారీగా ఉంది. దీంతో మద్యం రిటైల్ దుకాణాలు ఇష్టానురంగా విక్రయాలు జరుపుతుండటంతో ఏపీఎస్ బీసీఎల్ డిపోల నుంచి భారీగా మద్యం నిల్వలను ఎత్తివేయాల్సి వస్తోంది. ఈ తరుణంలో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగి మద్యం నిల్వల ఎత్తివేత, అమ్మకాలపై ప్రతిరోజూ జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం ఎక్సైజ్ అధికారులు మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించడంతో పాటు నిల్వల ఎత్తివేతపై కూడా ఆంక్షలు విధించారు. అయితే రాత్రి వున్న షాపు మరుసటి రోజుకల్లా మూత పడుతుండటంతో ఎందుకు మూసారో ఏమి జరిగిందో అర్థంకాక తలలు పట్టుకుంటున్న మద్యం ప్రియులు తలలు పట్టుకుంటున్నారు. కాగా మే 13న రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్, జూన్ 4న ఓట్ల లెక్కింపునకు ఈసీ షెడ్యూల్ ప్రకటించడంతో ఒకటి రెండు స్థానాలు మినహా అన్ని పార్టీల అభ్యర్థుల జాబితా పూర్తయింది. వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన నేతలు రోడ్డెక్కడంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది.

సీపీఎం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం, బుడ్డపాడు గ్రామంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ అంటరాని తనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు జ్యోతిరావు పూలే కృషి చేసారని, 1873 సెప్టెంబరు 24న, ఫులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు అన్నారు. లాగ్రేంజ్‌లోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో ఫులే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డారని. ఫూలే మరియు అతని భార్య సావిత్రిబాయి ఫులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు అన్నారు. అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెంచారని తెలిపారు. ఫులే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించారు. అతను వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఈ జంట ఉన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయనే జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ప్రజల హక్కుల పై జరుగుతున్న దాడులను ఎదుర్కోవటానికి ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు రాజుబాబు, బాలరాజు, పండియ్య,రాజు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపి అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు లకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వైసీపీ నాయకులు పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు చూసి ఓట్లు వేసి గెలిపించాలంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీసీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, లంకా సూర్యనారాయణ, జగతా శ్రీను, ధనిశెట్టి సత్య మహేష్, దోమాడ సుందరం, కొప్పిశెట్టి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు స్వచ్ఛంద రాజీనామా

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని 3వ సచివాలయంకు చెందిన 18మంది వాలంటీర్లు స్వచ్ఛంద రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాలను ఎంపిడిఓ కె.స్వప్నకు అందజేశారు. ప్రభుత్వ పథకాలు పారదర్శికంగా అమలు చేస్తున్న తమపై కొంతమంది రాజకీయ నాయకులు బురద జల్లుతున్నారని వాపోయారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి పాయకరావుపేటలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఇంజరపు సూరిబాబు, ఐఎన్ మూర్తి, కువల కుమార్, రాజు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

విశాలంధ్ర - అచ్యుతాపురం : మండల కేంద్రంలో స్టార్ జన్ హాస్పిటల్ దగ్గరలో బెంజ్ లారీ ఢీకొన్న ప్రమాద సంఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. గురువారం అచ్యుతాపురం నుంచి ఎల మంచిలి వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న దుప్పితూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి శేఖర్, లారీ చక్రాల కింద పడి చనిపోయాడు. మరొక యువకుడు పోలిక లేనట్టు నుజ్జు నుజ్జు అయ్యాడు. అదే గ్రామానికి చెందిన నర్మాల అమల చక్రాల కింద పడి ప్రాణా పాయంతో చివరి శ్వాసతో కొట్టుమిట్టాడుతుంది. ప్రమాద సంఘటనా స్థలాన్ని పోలీసులు చేరుకొని వివరాలు సేకరి స్తున్నారు. ప్రమాద సంఘటన విషయం వ్యాపించడంతో దుప్పి తూరు గ్రామానికి చెందిన గ్రామస్తులు అనేకమంది తరలివస్తున్నారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బిజెపి నాయకులు. తెలుగుదేశం బిజెపి జనసేన ఉమ్మడి ఎం ఎల్ ఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చింతకాయల అయ్యన్నపాత్రుడు కి సైకిల్ పై మరియు బిజెపి ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్ కి కమలం పువ్వు పై ఓటు వేసి గెలిపించాలని మాకవరపాలెం పంచాయతీ లో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన బిజెపి రాష్ట్ర కన్వీనర్ అడిగర్ల రాంబాబు మాకవరపాలెం మండలం ఓబిసి మోర్చ అధ్యక్షులు అనకాపల్లి ఆంజనేయులు మండల బిజెపి అధ్యక్షుడు మత్రి నాయుడు, బిజెపి మండల కన్వీనర్ బత్తుల రమేష్, యర్రా కుల్లయ్య,,పెంటయ్య, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని ముస్లిం వీధి వద్ద పూరి గుడిశె అగ్నికి ఆహుతై సర్వం కోల్పోయిన లోకవరపు లక్ష్మి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో చోడిశెట్టి వెంకటేష్, కడిమి శివ, బొండాడ రమణ, సీహెచ్ లోవరాజు, గొల్లపల్లి సాయి, ఎస్కె షబ్బీర్, ఎస్.రాయుడు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన 39వ వార్డు యువత

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల తారక రామారావు నగర్,పద్మనగర్,రామకృష్ణ నగర్‌కు చెందిన దాదాపు 30 మంది యువకులు ఉమ్మడి అభ్యర్థి వంశీ కృష్ణ శ్రీనివాస్ సమక్షంలో జనసేన లో చేరారు. జిల్ని భీమా, చింతకాయల ముత్యాలు బండా రాంబాబు, దుండి శివ,వల్లంకి శంకర్, బాండ గణేష్, మూస శివ, పిల్లి శివ, కట్ట నూకరాజు, వంకర ముత్యాలు, కానూరి సంతోష్, తదితర యువత సుమరు 30 మందిని వంశీకృష్ణ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 39వ వార్డు జనసేన అధ్యక్షులు తాతారావు పాల్గొన్నారు.

శంకరం, రేబాకలో జనసేన, బీజేపీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: శంకరం రేబాక గ్రామాలలో బుధవారం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ తనయుడు రుత్విక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిత్విక్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి సీఎం ఒక్కడే ఉంటే మీ అనకాపల్లికి ఇద్దరు సీఎంలు ఉంటారని ఒకటి చంద్రబాబు నాయుడు అని రెండు సీఎం రమేష్ అని కనుక మీ గ్రామ నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడాల్సిన పనిలేదన్నారు. ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జనసేన పేరుతో నేను గెలిచిన సరే తెలుగుదేశానికే ముఖ్య ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఒక్క ఛాన్స్ అని అడిగి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. అలాగే మన ప్రాంతంలో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉన్నప్పటికీ వైసీపీ ఎమ్మెల్యే అమర్నాథ్ పారిశ్రామిక మంత్రిగా ఉన్నప్పటికీ ఒక పరిశ్రమను కూడా తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని అలాగే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వృద్ధాప్య పెన్షన్ 4000 రూపాయలు ఇస్తూ మార్చి ఏప్రిల్ మే నెలలో బ్యాలెన్స్ వెయ్యి రూపాయలు ఏదైతే ఉందో అది కలుపుకొని 7000 రూపాయలు జులై నెలలో మీకు అందజేయడం జరుగుతుందన్నారు. మన దగ్గర టాక్స్ మద్యం రూపంలో వసూలు చేసి మనకు పైసలు రూపంలో సంక్షేమ పథకాలు ఇస్తున్నాడని ఆడపడుచులు అందరూ ఇది గ్రహించాలని తెలిపారు. మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని వారికి తోడుగా పవన్ కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలు ఆలోచనలు తోడైతే కేంద్రం నుంచి పరిశ్రమలను తీసుకొచ్చి మీ పిల్లలకు మంచి భవిష్యత్తును ఇచ్చే ఉద్యోగ భద్రత కలుగుతుందని తెలిపారు. అనంతరం గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఎంపీ అభ్యర్థిగా కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి సీఎం రమేష్‌ని గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, బుద్ధ నాగ జగదీష్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

84వ వార్డులో గడపగడపకు ప్రచారం....

అనకాపల్లి స్థానిక జీవీఎంసీ 84వ వార్డు కోట్ని వీధిలో గురువారం ఉదయం తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఉమ్మడి బిజెపి ఎంపీ అభ్యర్థి తనయుడు రిత్విక్ గడపగడపకు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణకు ప్రజలు పూల వర్షం కురిపిస్తూ అడుగడుగునా హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ బిజెపి నాయకులు పొన్నగంటి అప్పారావు పాల్గొని రామకృష్ణ ,రిత్విక్ లతో పాటుగా వచ్చే ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే మనకు జరిగే అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రజలకు వచ్చే సంక్షేమ పథకాలు కోసం వివరిస్తూ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి గ్లాస్ గుర్తుపై ఓటు వేయాలని అలాగే ఎంపీ అభ్యర్థిగా కమలం పువ్వు గుర్తుపై ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి సెంటర్లో ఉన్నటువంటి మోదకొండ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం కోట్ని వీధి కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ గడపగడపకు కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ, కోట్ని కొండలరావు, తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని సూరిబాబు, దొడ్డి నాగు, కోట్ని అయ్యన్న దొర, గేదెల స్వరూప్ పాల్గొన్నారు.

వ్యాపార కేంద్రంగా అనకాపల్లి ప్రసిద్ధి

మర్చంట్ అసోసియేషన్ ఆత్మీయ కలయికలో సిఎం రమేష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ,టీడీపీ,జనసేన కూటమి ఉమ్మడి ఎంపి అభ్యర్థి సిఎం రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతం వరి,చెరకు,కొబ్బరి వంటి ముఖ్యమైన పంటలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతమని అన్నారు.బెల్లం మార్కెట్ లో ప్రపంచంలోనే గుర్తింపు పొందిందన్నారు. అనకాపల్లి వ్యాపారానికి అనువైన స్థలంగా ఉందని,కనుక మర్చంట్ అసోసియేషన్ సభ్యులకు తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనకాపల్లి పట్టణం 'శారదా నది' అనే నది తీరాన ఉందని అంటూ, ఇది మాడుగుల కొండల్లో జన్మించి చోడవరం,అనకాపల్లి, యలమంచిలి మీదుగా ప్రవహిస్తుందన్నారు. ఇటువంటి వనరుల కలిగిన నగరం కనుక త్వరితగతిన అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. వైసీపీ ప్రభుత్వం లో వ్యవస్థలు అన్నిటినీ నాశనం చేసారన్నారు. రాబోయే ప్రభుత్వం టీడీపీ,బీజేపీ,జనసేన ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం,టీడీపీ అనుభవం,జనసేన శక్తి తో ఆంధ్రప్రదేశ్ ను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని రమేశ్ పేర్కొన్నారు.కూటమి అభ్యర్థులను గెలిపించారని కోరారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బుద్ధ నాగజగదీష్, ద్వారంపూడి పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే

మహాత్మా జ్యోతిరావ్ పూలే గొప్ప సంఘ సంస్కర్తగా నాటి సమాజంలోని అసమానతలను పారద్రోలడానికి ఎనలేని కృషి చేసిన మహనీయుడని అనకాపల్లి పార్లమెంట్ బిజెపి,టిడిపి,జనసేన ఉమ్మడి అభ్యర్థి సి ఎం రమేష్ అన్నారు.అనకాపల్లి లో గురువారం ఉదయం మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఎం రమేష్ ముందుగా మహాత్మా జ్యోతీరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తన చిన్న తనంలో జ్యోతీరావు పూలే అనుభవించిన అంటరానితనం,మనుషుల మధ్య అంతరాలు,మూఢనమ్మకాలు వంటి దురాచారాలను అంతం చేయడానికి గొప్ప కృషిచేసి మహాత్మా బిరుదుతో మహాత్మా జ్యోతీరావ్ పూలేగా వినుతికెక్కారని కొనియాడారు.స్త్రీ విద్యకోసం ఆనాడే కృషి చేసిన మహనీయుడని అన్నారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ,మాజీ ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ ,పీలా గోవింద సత్యనారాయణ,బుద్ధ నాగజగదీష్, ద్వారంపూడి పరమేశ్వరావు, సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ఓటర్లందరూ వైసీపీవైపే

ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి సతీమణి మాలతి

విశాలాంధ్ర - మర్రిపాలెం: పశ్చిమ నియోజకవర్గం ఓటర్లందరూ వైసీపీ వైపే ఉన్నారని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సతీమణి ఆడారి మాలతి అన్నారు. 89వ వార్డు అధ్యక్షులు ఐతంశెట్టి గోపి, వార్డు ఇంచార్జి దొడ్డి కిరణ్, పీఏసీఏ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మళ్ల శ్రీను ఆధ్వర్యంలో చంద్రనగర్ లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ కి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ కి తిరుగులేని మెజారిటీ వస్తుందని అన్నారు. వైసీపీకి ప్రజల మద్దతు ఉందని, మరోసారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. ప్రతిపక్షాలు పన్నుతున్న కుట్రలను ప్రజలు తెలుసుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ఎవరికి కష్టం వచ్చినా, నేనున్నానని ఆనంద్ మీ ముందుకు వస్తూ, సేవ చేస్తున్నారని గుర్తు చేసారు. ఎటువంటి అధికారం లేకుండానే ఇంత సేవ చేస్తున్న ఆడారికి, ఒక్కసారి ఎమ్మెల్యే గా గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీ చాణిక్య పాఠశాల 5వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - మధురవాడ: మధురవాడ డాక్ యార్డ్ కాలనీ లో పేద, మధ్య తరగతి పిల్లలకు సామాజిక బాధ్యతతో మెరుగైన విద్యను అందిస్తున్న శ్రీ చాణిక్య స్కూల్లో 5వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు విశాలాంధ్ర విశాఖపట్నం జిల్లా బ్యూరో చీఫ్ రిపోర్టర్ పి.రామకృష్ణ, శ్రీకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మేడబోయిన సూరిబాబులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాలాంధ్ర బ్యూరో చీఫ్ రామకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విలువలతో, అంకితభావంతో, విద్య అందరికీ అందించాలనే లక్ష్యంతో అందరికీ అందుబాటులో శ్రీ చాణిక్య స్కూల్ నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా కరస్పాండెంట్ కర్రి మోహన్‌రావును అభినందించారు. ఈ స్కూల్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న ఆవుపాటి కార్తీక్ కుమార్ అంకితభావంతో పని చేస్తూ ఈ పాఠశాలను ఉత్తమ ఫలితాలతో ముందుకు నడిపిస్తున్నారని అభినందించారు. సమిష్టి కృషితో స్కూలు ఉన్నత అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ, చిన్నారులకు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకే తపన పడుతున్నా మన్నారు. ఈ సందర్భంగా శ్రీ చాణిక్య స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విస్తృతంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి మండలం బవులువాడ గ్రామంలో గ్రామ సర్పంచ్ మజ్జి లక్ష్మి వెంకట అప్పారావు నేతృత్వంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ గురువారం ఎన్నికల ప్రచారం ఘనంగా జరిగింది. ముందుగా గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి ప్రచారం లో పాల్గొన్నారు. రోజు రోజుకు భరత్ వెంట నడిచేందుకు పెద్ద ఎత్తున జనం తరలివస్తున్నారు. ప్రచార స్థలానికి చేరుకోగానే మహిళలు, స్థానిక నాయకులు భరత్ కు ఘన స్వాగతం పలికారు ప్రచారంలో భాగంగా భరత్ గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు ఈ ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. గడప గడపలో మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి భరత్ కు హారతులు ఇచ్చారు.మార్గ మధ్యలో అవ్వా తాతలను పలకరిస్తూ వారి యోగ క్షేమాలని అడిగి తెలుసుకుని తనను దీవించాలని భరత్ విజ్ఞప్తి చేశారు. విద్యావంతుడైన నన్ను దీవించి ఎమ్మెల్యేగా చేస్తే అనకాపల్లి ని అభివృద్ధి చేస్తానని, ప్రజలందరికి అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా పరిష్కారిస్తానని చెప్పారు.తామంతా మీకు సహకరిస్తామంటూ భరత్ కు భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాలకు, మరీ ముఖ్యంగా మహిళలకు చేసినంత మేలు మరే ముఖ్యమంత్రి చేయలేదు అన్నారు.ఎన్నికలలో వైసీపీ విజయం సాధించి, జగన్మోహన్ రెడ్డి ని మరొకసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని సూచించారు అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి సుస్థిరమవుతుందని ఆయన చెప్పారు. మే 13 న జరగబోయే ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి గా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గా మలసాల భరత్ కుమార్ ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందా,గ్రామ పార్టీ అధ్యక్షులు మజ్జి వెంకట అప్పారావు, దాడి కుమార్, బొద్దపు ప్రసాద్, ముమ్మిన శ్రీనివాసరావు, ముత్యాలకన్నారావు,ఉప్పులూరి శ్రీనివాసరావు, అధికారి వెంకటరావు, కరణం నాయుడు, మడక వీరు బాబు, ముమ్మిన శ్రీను,సేనాపతి సూర్యారావు, నేమాల రమణాజీ, చొప్ప శ్రీను, తూరిబిల్లీ చంటి, తూరిబిల్లి శ్రీను ,గాడి చిలుకు, బొద్దపు శ్రీను, జమాదుల రామకృష్ణ, ఎండి ముస్తఫా, పితాని మారేసు, జాయిల్ మనోహర్, వాయుబోయిన శ్రీను, కాకర అచ్చి బాబు, యలం అప్పలరాజు, బలిరెడ్డి సత్తిబాబు, వెన్నెల నాగేశ్వరరావు, టెక్కల శ్రీను, నక్క రమణ, రవి, ప్రకాష్ రావు, దాడి శ్రీరాములు, ఎండి గౌస్,మోటూరి భాను, కందుబోతు బుజ్జి, గొర్లి నాయుడు, గాలి సన్యాసిరావు పాల్గొన్నారు.

సరిపల్లిలో ఇంటింటి ప్రచారం చేసిన గుంటూరు సతీమణి

విశాలాంధ్ర -పెందుర్తి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఏపీ గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ గుంటూరు వెంకట నరసింహారావు సతీమణి శ్రీమతి భారతి ఉధృతంగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరు సరిపల్లిలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామంలోని వీధుల్లో తిరిగి అందరినీ ఆప్యాయంగా పలకరించి, మహిళలకు బొట్టు పెట్టి వచ్చే ఎన్నికల్లో తన భర్త గుంటూరు వెంకట నరసింహారావుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వెంకట నరసింహారావు ఎమ్మెల్యేగా గెలిస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. సరిపల్లి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తారని హామీ ఇచ్చారు. గుంటూరు కుటుంబ సభ్యులకు సరిపల్లి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రచార కార్యక్రమంలో గుంటూరు కుటుంబ సభ్యులు కనకమహాలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.